క్లుప్తంగా

గిరిజన మహిళ హత్యకు కారకులను శిక్షించాలి



ఉక్కు టీటీసీ కూడలి వద్ద ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు

ఉక్కునగరం: ఇటీవల జరిగిన గిరిజన మహిళ హత్యకు కారకుడైన శ్రీనివాసకుమార్‌పై కఠిన చర్యలు చేపట్టాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గిరిజన మహిళ హత్యకు నిరసనగా ఉక్కు టీటీసీ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టడం ద్వారా మరొక మహిళకు ఇలా జరగకుండా గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య, బి.తౌడన్న, సత్యం నాయుడు, ఎస్. సత్యనారాయణ, కొమ్ము ప్రసాదరావు, ఎస్. మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగార పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మంది ప్రజలకు పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 839వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కు కోసం ప్రత్యేకంగా చర్చించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రవీంద్ర

గాజువాక: ప్రధానమంత్రి మోదీ సారథ్యంలో బీజేపీ పాలనకు తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిరుపేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గాజువాక మండల అధ్యక్షుడు గుంటూరు శంకర్ సహకారంతో గాజువాక హైస్కూల్ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, గాజువాక నియోజకవర్గం కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నెలరోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సోంబాబు, ముసలయ్య, రోహిణి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని శాంతినగర్ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణ, హోమం జరిపించారు. ఆలయ ధర్మకర్త ఇ.కె.చారి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అగనంపూడి పరిసర కాలనీల భక్తులు పాల్గొని హోమం జరిపించారు.

ఆవిష్కరణల వేడుక.. ఆధ్యాత్మిక వీచిక

తుంగ్లాం గ్రామంలో ముగ్గురమ్మలు కొలువుదీరిన శుభ ముహూర్తాన ఆధ్యాత్మిక పరిమళాలు భక్తులను తన్మయులను చేశాయి. స్వామీజీకి స్వాగతం పలికేందుకు తరలివచ్చిన భక్తజనసందోహంతో రహదారులన్నీ కిక్కిరిశాయి. షీలానగర్‌లో కలియుగ దైవం తిరుమల బాలాజీ విగ్రహావిష్కరణతో భక్తి సమీరాలు పలకరించాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాలిగోపురం ప్రతిష్ఠ, మాతృశ్రీ నగర్‌లో సాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలతో భక్తుల ఉత్సాహం మరింత ఇనుమడించింది. ఆవిష్కరణ వేడుకల నేపథ్యంలో ఏకాదశి పర్వదినాన గాజువాక నియోజకవర్గం బుధవారం పండగ శోభను సంతరించుకుంది.



తుంగ్లాంలో ప్రతిష్ఠించిన కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహాలు



కుంచాలమ్మ అమ్మవారి సన్నిధిలో సిద్ధేశ్వరానంద భారతి, రమ్యానంద భారతీ స్వామి

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. విశాఖ శ్రీ లలితా పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి నూతన ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహాలను ఆవిష్కరించారు. ముందుగా శ్రీ సిద్ధేశ్వరానంద భారతి, శ్రీ రమ్యానంద భారతిలను ఆలయాల వద్దకు తోడ్కొని రావటానికి తుంగ్లాం గ్రామకమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో కలిసి



స్వామీజీ, మాతాజీలకు స్వాగతం పలికేందుకు ర్యాలీగా తరలి వెళ్తున్న తుంగ్లాం గ్రామస్తులు

షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు చేరుకుని భారీ స్వాగతం పలికి, ఆలయాల వద్దకు తీసుకువచ్చారు. కుంచాలమ్మ ఆలయంలో పూజలు చేసిన స్వామీజీ, మాతాజీ అమ్మవారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం దుర్గాలమ్మ, ముత్యాలమ్మ వార్ల ఆలయానికి చేరుకుని అమ్మవార్ల విగ్రహాలను ఆవిష్కరించారు. ఆలయాల వద్ద హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్లు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. అన్నసమారాధనలో 20 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠ

కూర్మన్నపాలెం: 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి దత్తాత్రేయ సహిత షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇరగవరపు వెంకట శ్రీధర్ స్వామి, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపనోత్సవాలు జరిగాయి. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి, 86వ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు, దమయంతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.



ప్రతిష్ఠించనున్న సాయినాథుడికి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సుబ్బారావు దంపతులు



గాలి గోపురం వద్ద రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, శ్రీధర్ స్వామిజీ

శాస్త్రోక్తంగా గాలి గోపురం ప్రతిష్ఠ

పెదగంట్యాడ: హౌసింగ్ బోర్డు సమీపంలోని కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గాలి గోపురాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, శ్రీధర్ స్వామీజీ బుధవారం ప్రారంభించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు, సాయంత్రం పరస ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముమ్మిడి శెట్టి ముత్యాలశెట్టి, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర ప్రతిష్ఠ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుమల బాలాజీ మందిరంలో బాలాజీ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. విశేష పూజలు, హోమాలు, చక్రస్నానాలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. సుముహూర్తమున యంత్ర రత్న ధాతున్యాసనములు, బింబ ధ్వజ స్తంభ స్థాపనము, వాస్తు హోమం, మహా పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. శ్రీ బాలాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, అదీప్‌రాజ్, ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. బాలాజీ మాలధారణ చేపట్టిన ఎస్టీబీఎల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న బాలాజీ దంపతులు, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్



స్వామి సన్నిధిలో గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఉక్కు ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు



ఉద్యోగుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇంజినీరింగ్ షాప్స్‌లోని ఫోర్జ్ షాప్ నుంచి ఉద్యోగ విరమణ చేస్తున్న తోకాడ అప్పారావు, ఆర్. అప్పలరాజు వీడ్కోలు కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విభాగం అధికారులు ఉద్యోగుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వై. మస్తానప్ప, ఎం. పరదేశి, నక్క వెంకటరమణ, పిట్టారెడ్డి, జి. అప్పలరెడ్డి, పులి రమణారెడ్డి, గంట్యాడ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం కల్లూరి శ్రీనివాసరావు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, బీఎంకె నాయక్, పి.వి. రమణమూర్తి, కోరాడ వెంకటరావు, గంగవరం గోపీ తదితరులు పాల్గొన్నారు. ఉక్కు అధికారుల సంఘం కమిటీ ప్రతినిధులు ఎ. అనిల్ కుమార్, పిట్టా ఈశ్వరరావు సీజీఎం శ్రీనివాసరావును కలిసి శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ అధికారులు ఎస్.వి.ఎస్. రాజు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలల పునః ప్రారంభం



ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్

అగనంపూడి: జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ తరగతులు గురువారం నుంచి ప్రారంభం అవుతున్నాయని అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో పాటు వరుసగా మూడు సంవత్సరాలు ఉత్తమ ఫలితాలు సాధించడంతో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలు జోరందుకున్నట్టు చెప్పారు. అమ్మ ఒడికి విద్యార్థుల హాజరు 75 శాతానికి తగ్గకుండా ఉండాలనే నిబంధన ఉండడంతో, విద్యార్థులు కళాశాల పునఃప్రారంభం నుంచి తరగతులకు హాజరు కావాలని సూచించారు. ఈ ఏడాది ఎంపీసీలో ఇప్పటికే సగం సీట్లు భర్తీ అయ్యాయని, కేవలం 40 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈఈటీలో 30 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఎనిమిది సీట్లు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సీఈసీలో 52 ఖాళీలు మిగిలి ఉన్నాయని, ముందుగా వచ్చిన వారికి మాత్రమే సీట్లు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు.

పొగాకుకు వ్యతిరేకంగా 8 కిలోమీటర్ల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



పొగాకు వ్యతిరేక దినంలో పాల్గొన్న గాజువాక పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

గాజువాక : పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా స్థానిక స్వామి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ఎనిమిది కిలోమీటర్ల ర్యాలీ నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ కొత్తగాజువాకలోని సాయిరామ్ నగర్‌లో ప్రారంభమై హైస్కూల్ రోడ్, జింక్ గేట్, కొత్త గాజువాక, పాతగాజువాక, ఆటోనగర్, శంకర్‌నగర్ మీదుగా తిరిగి సాయిరామ్ నగర్‌కు చేరుకుంది. పొగాకు వ్యతిరేకంగా 15 జంక్షన్లలో సమావేశాలను నిర్వహించారు. పొగాకును వినియోగించడంవల్ల నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం మెడికల్ రీజనల్ ఆఫీసర్ డాక్టర్ హేమలత మాట్లాడుతూ పొగాకును వినియోగించడంవల్ల వచ్చే రకరకాల క్యాన్సర్లను, జబ్బులను వివరించారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి ప్రారంభించిన ర్యాలీలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కౌన్సిలర్ డాక్టర్ పాలూరి లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో.. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా గాజువాక పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్.బద్రినారాయణమూర్తి, పి.పద్మ, డాక్టర్ గీత, సీహెచ్‌వో పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పాడిన కణితి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

కణితి పీహెచ్‌సీలో.. కూర్మన్నపాలెం: 86వ వార్డు కణితి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు వల్ల అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో బాబీ, హెచ్‌ఎస్ గోపీ, పీహెచ్‌ఎన్, హెచ్‌వీ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఉక్కునగరం: దేశ పాలకులు అనుసరిస్తున్న విధానాల మూలంగా లబ్ధి పొందే కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవడం కార్మికుల కర్తవ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉక్కునగరం సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ‘కార్మిక ఉద్యమం–నూతన పరిస్థితులు’ సదస్సులో ఆయన మాట్లాడారు. సీఐటీయూ లక్ష్యం కార్మికులను, సంఘాలను ఏకం చేసి, ఐక్య ఉద్యమాలతో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడమన్నారు. నియంతృత్వ నాయకుల కారణంగా వ్యవస్థలు గాడి తప్పుతున్నాయన్నారు. అమిత అధికార దాహం కలిగిన నాయకుల చేతి నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి, అధ్యక్షుడు వై.టి.దాస్ ప్రసంగించిన కార్యక్రమంలో కె.ఎం.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

రామలింగేశ్వరరావు సేవలు ఎనలేనివి

అగనంపూడి: తపాలా వృత్తికి రామలింగేశ్వరరావు వన్నె తెచ్చారని విశాఖ లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్మన్ కిడిమి హనుమంతురావు, అగనంపూడి హార్టికల్చరల్ సొసైటీ చైర్మన్ నెల్లి శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి పోస్ట్‌మాస్టర్‌గా సేవలందించి, పదవీ విరమణ పొందిన పొన్నగంటి రామలింగేశ్వరరావును ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పాటు పోస్టల్ రంగంలో విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఇక్కడి ప్రజల ఆదరణ మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తోకాడ రాము, బలిరెడ్డి సత్యనారాయణ, కొలిపాక అప్పారావు, దొడ్డి దేముడు, కట్టా పైడిరాజు, కసిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడి పోస్ట్‌మాస్టర్ రామలింగేశ్వరావును సత్కరిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా
- ముగిసిన స్వచ్ఛత పక్వాడా

పరవాడ: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతంగా జీవించగలమని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు.సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఈ నెల 16న ప్రారంభించిన స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం బుధవారంతో ఘనంగా ముగిసింది. ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, కాంట్రాక్టు కార్మికులు, సింహాద్రి ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు ఉత్సాహంగా పాల్గొని ప్రాజెక్టు పరిసరాలు, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలను శుభ్రం చేశారు. సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ కార్యాలయంతో పాటు పరిసరా శుభ్రత బాధ్యతగా బావించాలని సూచించారు. దీని ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందని చెప్పారు. బాలిక సాధికారిత మిషన్– 2023లో భాగంగా బాలికల కోసం వివిధ పోటీలు నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి పరిశుభ్రతపై వీధి నాటకాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. జీజీఎం సిన్హా వాడ చీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. దీపాంజలినగర్ దుకాణ సముదాయంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు.



తిక్కవానిపాలెం తీరంలో చెత్త సేకరిస్తున్న సింహాద్రి జీజీఎం సిన్హా, ఉద్యోగులు

అందుబాటులో అధునాతన వైద్యసేవలు

- పారిశ్రామిక ప్రాంత పెద్దాస్పత్రిగా అగనంపూడి ఏరియా ఆస్పత్రి అభివృద్ధి
- క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, వైద్యసేవలు
- కేజీహెచ్‌కు తగ్గుతున్న రిఫరల్ కేసులు
- ఆర్థో విభాగంలో సేవలకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు
- ప్రతీ వారం సదరం శిబిరాలు



అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో ఆర్థో సేవలు అందిస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి



అగనంపూడి ఏరియా ఆస్పత్రి

అగనంపూడి: అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తరువాత ప్రాంతీయ ఆస్పత్రిలో అన్ని వసతులు కల్పించడంతో పాటు అన్ని విభాగాలకు వైద్యులను, సిబ్బందిని నియమించారు. సర్జన్లు, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ విభాగాలతో పాటు దాదాపు అన్ని రకాల వైద్య సేవలకు ప్రత్యేక వైద్య నిపుణులను నియమించడంతో రోగులకు కేజీహెచ్ వరకు వెళ్లాల్సిన అవసరం ఉండట్లేదు. ఇక్కడే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేస్తుండడంతో పారిశ్రామిక ప్రాంత పెద్దాసుపత్రిగా రూపాంతరం చెందుతోందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా రూ.17 కోట్ల వ్యయంతో ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నారు. అధునాతన వసతులు, వైద్య పరికరాలతో వంద పడకలు, అదనంగా ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, అడ్మిన్ బ్లాక్ తదితర సౌకర్యాల కల్పన ముగింపు దశలో ఉన్నాయి.

దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అగనంపూడి ఆస్పత్రిలో ప్రతీ బుధవారం ఆర్థోపెడిక్ డాక్టర్ వై. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సదరం క్యాంప్ ఏర్పాటు చేస్తున్నారు. అగనంపూడిలోనే శిబిరం ఏర్పాటు చేయడంతో దూరాభారం తగ్గడంతో పాటు పరిసర ప్రాంతీయులకు శ్లాట్ బుక్ చేసుకున్న వారం రోజుల్లో ధ్రువీకరణ పత్రం చేతికి అందుతోంది. దీంతో వారంతా ఆనందంగా ఉన్నారు. నెల రోజుల వ్యవధిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 70 నుంచి 80 వరకు ఇక్కడ శస్త్ర చికిత్సలు చేస్తుండడంతో ఉన్నతాధికారుల ప్రశంసలు, మన్ననలు దక్కించుకున్నారు.

గతంలో పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు లేదా ఇతర ఘటనల్లో క్షతగాత్రులను కేజీహెచ్‌కు లేదా వేలకు వేలు వెచ్చించి ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లాల్సి వచ్చేది. అగనంపూడి ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ ప్రత్యేక వైద్యాధికారిని నియమించిన తరువాత పరిస్థితి మారిందని స్థానికులు చెబుతున్నారు.

గాజువాక ఎమ్మెల్యే, ఆస్పత్రి కమిటీ చైర్మన్ తిప్పల నాగిరెడ్డి పర్యవేక్షణలో మెరుగైన సేవలు అందుతున్నాయని రోగులు చెబుతున్నారు. సదరం సర్టిఫికెట్ల మంజూరుతో పాటు ఆర్థోపెడిక్ సేవల విషయంలో అగనంపూడి ఆస్పత్రికి వైద్య ఆరోగ్య శాఖ, ఏపీవీవీపీ ఉన్నతాధికారుల ప్రశంసలు దక్కాయి. రాష్ట్ర స్థాయిలో ఎముకల విభాగానికి సేవల్లో గుర్తింపు వచ్చింది.

రోజుకు 60 నుంచి 80 మందికి ఆర్థో సేవలు



రోజుకు 60 నుంచి 80 మందికి ఆర్థో సేవలు అందిస్తున్నాం. నెలకు 70 వరకు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ఉత్తమ వైద్యాధికారిగా విశిష్ట పురస్కారం అందుకున్నాను. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ఏరియా ఆస్పత్రి, నర్సీపట్నం, యలమంచిలి, వడ్డాది మాడుగుల ఆస్పత్రుల్లో సదరం సేవలు అందిస్తున్నాం. ఇప్పటి వరకు 3 వందల క్యాంప్‌లు నిర్వహించి వేలాది మంది దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశాం.

– డాక్టర్ వై.కృష్ణమూర్తి, ఆర్థోపెడిక్ సర్జన్, అగనంపూడి ఏరియా ఆస్పత్రి

ఆర్థో విభాగానికి ప్రత్యేక గుర్తింపు



ఆర్థో విభాగంలో అగనంపూడి ఆస్పత్రికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. రోజూ ఓపీ విభాగంలో 80 మంది రోగులకు సేవలు అందిస్తున్నాం. దీంతో ప్రజల అభిమానంతో పాటు ఆస్పత్రికి గౌరవం దక్కింది.

– డాక్టర్ ఉష, ఆస్పత్రి సూపరింటెండెంట్

కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బుధవారం కిక్కిరిసింది. జూన్ 1వ తేదీ నుంచి భూముల రేట్లు పెరుగుతున్నాయన్న సమాచారంతో రిజిస్ట్రేషన్ పనులకు విచ్చేసిన వారితో కార్యాలయం నిండిపోయింది. దీనికి తోడు రెండు రోజులుగా సర్వర్ డౌన్ అవ్వడంతో రిజిస్ట్రేషన్ పనులు చాలా నిలిచిపోయాయి. బుధవారం పనులు మాన్యువల్‌గా నిర్వహించినట్లు సమాచారం.



గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిరీక్షిస్తున్న ప్రజలు

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్‌లో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. కంచరపాలెం సీఐ మళ్ల అప్పారావు హెల్మెట్ లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులకు అవగాన కల్పించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆటోలను ఆపి రికార్డులు పరిశీలించారు. పాత చలనాలు వసూలు చేశారు.